
# ఆమె




ఎవరో తలుపు తట్టిన శబ్దమైతే... పుస్తకం చదువుకుంటున్న నేను తలెత్తి గోడ గడియారం వైపు చూశాను.

పదకొండు చూపిస్తోంది. 'ఈ సమయంలో ఎవరొస్తారబ్బా?' అనుకుంటూ, లేచి వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా... ఓ అమ్మాయి నిలబడివుంది!

పాతికేళ్లలోపు వుంటుంది ఆమె వయసు. చాలా అందంగా వుంది. ఆమె కట్టుకున్న నల్లటి చుక్కలున్న తెల్లని కాటన్ చీరకు ఆమెవల్ల అందం వచ్చింది. ఆమె ధరించిన నల్లరంగు రవిక ఆమె మేని తెల్లదనాన్ని మరింత స్పష్టంగా చూపిస్తోంది.

ఆమె చనువుగా లోపలికొచ్చి కుర్చీలో కూర్చుంది.

నేను ఆమె చర్యకు ఆశ్చర్యపోతూ ఏం చేయాలో తోచక నిలబడివుంటే... "కూర్చోండి!" అంటూ మంచం చూపింది- తను హోస్ట్ అయినట్లు, నేను గెస్ట్ అయినట్లు!

నా మెతకదనాన్ని నాలో నేనే తిట్టుకుంటూ మంచంపై కూర్చున్నాను.

"నేనెవరో మీకు తెలియదు కదూ..?!" అంది.

అవునన్నట్లు తల నిలువుగా ఊపాను.

"మీరు మాత్రం నాకు బాగా తెలుసు..."

ఎలా తెలుసన్నట్లు ఆశ్చర్యంగా చూశాను ఆమె వైపు.

"మీరు రోజూ ఆఫీసుకి మా ఇంటిమీదుగానే వెళ్తుంటారు."

'అలాగా...' అన్నట్లు చూసి, "ఇంతకీ ఈ వేళప్పుడు వచ్చారేం? మా ఆఫీసులో పనేదైనా వుందా?" అని అడిగాను.

"అబ్బేఁ... అలాంటిదేం లేదు. నాకు అర్జంటుగా ఐదు వందలు కావాలి. మళ్లీ వీలైనంత త్వరలో మీకిచ్చేస్తాను..." అంది.

నాకు ఒళ్ళుమండింది. మా మధ్య ఏం చనువుందని అంత డబ్బు అప్పుగా అడుగుతోంది? నేను ఆమెను చూడడం, మాట్లాడడం ఇదే మొదటిసారి! మొదటి పరిచయంలోనే అప్పు అడిగే ఈమెను ఎలా అర్థంచేసుకోవాలో అర్థంకాలేదు.

ఆమె నా మొహం చూసి, నా మనసులోని భావాలు చదివినట్లుంది.

"మీకు ఇష్టం లేకపోతే వద్దు. 'ఆ ఐదు వందలు మళ్లీ రావు' అనే అనుమానం మీకుంటే చెప్పండి... ఈ రాత్రంతా మీతోనే ఉండిపోయి మీ ఋణం తీర్చుకుంటాను."

మళ్లీ ఆశ్చర్యంగా చూశాను ఆమె వైపు.

ఆమె మొహంలో వేళాకోళం లేదు. సీరియస్‌నెస్ ఉంది. ఆమెను నఖశిఖ పర్యంతం పరిశీలించాను. అందమైన రూపమే కాదు, ఆకర్షణీయమైన శరీర సౌష్టవం కూడా ఆమెకుంది.

నేను బ్రహ్మచారిని. ఆడదాని స్పర్శకోసం తపించడం లేదు కానీ, కోరుకుంటున్న వాడ్నే... మగాడిని కాబట్టి! వయసు ముప్పై ఏళ్లు దాటుతున్నా పెళ్ళి చేసుకోకపోవడానికి కారణం... పెళ్ళంటే ఆసక్తి లేక కాదు- నా పెళ్ళికోసం తపించేవాళ్ళూ, ప్రయత్నించి సంబంధం కుదిర్చేవాళ్ళూ ఎవరూ లేక! అనాథ శరణాలయంలో పెరిగాను. చదువు పూర్తయ్యాక ఉద్యోగం తెచ్చుకుని ఒంటరి జీవితం గడుపుతున్నాను. అయితే ఓ ఆడపిల్ల అలా సిగ్గువిడిచి మాట్లాడ్డం జీర్ణించుకోలేకపోతున్నాను.

"నేను మీకు నచ్చలేదా?" అని అడిగింది- నా మౌనం చూసి.

"ఎందుకు నచ్చలేదు? బాగా నచ్చారు..."

"మరైతే... ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"మీరు ఇలా సిగ్గువిడిచి మాట్లాడడానికి కారణం ఏమైవుంటుందా... అని ఆలోచిస్తున్నాను."

ఆమె దెబ్బతిన్నట్లు చూసింది. క్షణాల్లో ఆమె కళ్ళనిండా నీళ్లు నిండాయి.

"కారణం ఏమైవుంటుందో మీరు ఊహించగలరా?" దాదాపు ఏడుస్తూ అందామె.

ఊహించలేనట్లు తలూపాను.

"ఆకలి... నేను భోజనం చేసి రెండురోజులవుతోంది!" అంటూ మొహాన్ని చేతులతో కప్పుకుని భోరున ఏడవసాగింది.

నా మనసు కలచివేసినట్లయింది. ఆమె వైపు జాలిగా చూసి, ప్రక్క గదిలోకి వెళ్లాను. అల్మైరాలో వున్న బ్రెడ్, బిస్కెట్ ప్యాకెట్, రెండు అరటిపళ్ళు తీసుకుని ఆమె చేతిలో పెట్టి, "తినండి..." అన్నాను.

ఆమె తినలేదు. చాలాసేపు అలాగే ఏడుస్తూ ఉండిపోయింది. తరువాత లేచి నిలబడి, "వస్తాను... చాలా థాంక్స్!" అంది.

"తినలేదేం..?!"

"నాతో పాటు ఆకలిని పంచుకుంటున్న మా అమ్మ, తమ్ముడు, చెల్లి ఇంట్లో ఉన్నారు. ఇవి వాళ్ళతో కలసి పంచుకుంటాను..." అంటూ గుమ్మం వైపు నడిచింది.

ఆమె నా గదికి ఎందుకు వచ్చిందో అప్పుడు గుర్తుకొచ్చి, "ఆగండి... మీరు డబ్బు అడిగారు!" అన్నాను.

"వద్దండీ... నాకు సిగ్గూ, లజ్జా ఉన్నాయి."

"నన్ను మన్నించండి! అనాథ శరణాలయంలో పెరిగిన నేను అక్కడ మాకు చిన్నప్పటి నుంచీ నేర్పిన సూక్తులన్నీ మెదడులోనే కాక మనసులోకి కూడా ఎక్కించుకున్నవాడ్ని. మీరు అలా మాట్లాడడం నాకు కోపాన్ని తెప్పించింది. కారణం చెప్పాక మిమ్మల్ని అర్థంచేసుకున్నాను. ఆకలి ఎంత బాధాకరమో నాకూ తెలుసు... ఉండండి!" అంటూ లోపలికి వెళ్లి ఐదు వందలు తీసుకొచ్చి ఆమె చేతిలో పెట్టాను.

"థాంక్సండీ... మీ డబ్బు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఇచ్చేస్తాను."

"అలాగే కానివ్వండి."

ఆమె వెళ్లిపోయింది.

కుర్చీలో కూర్చుని పుస్తకం చేతిలోకి తీసుకున్నాను. మనసు చదువుపై లగ్నం కాలేదు. లైట్ ఆఫ్ చేసి పడుకున్నాను. ఆమె గురించే ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను.

●

రెండురోజుల తరువాత ఓ ఉదయం నా గదికి వచ్చింది ఆమె.

ఆరోజు రాత్రి ఆమెలో కనిపించిన నీరసం, బడలిక ఈరోజు కన్పించలేదు నాకు. చాలా ఉత్సాహంగా ఉంది. ఆ ఉత్సాహం వల్ల ఆమె మరింత అందంగా కనబడుతోంది.

"మీవల్ల మా ఆకలి తీరింది. రెండుపూటలూ కడుపు నిండా తినగలుగుతున్నాం. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను..." అంది.

"అదేం పెద్ద సహాయం లెండి! ఇంతకీ మీరు ఎక్కడుంటున్నారు? మీ నాన్నగారేం చేస్తారు?" అని అడిగాను.

"మీ వీధిలోనే మేముంటున్నాం. మా నాన్న ఓ ప్రైవేటు కంపెనీలో వాచ్‌మన్‌గా పనిచేసేవారు. తన సంపాదన మొత్తం తాగుడుకే తగలబెట్టేవారు. అందమైన మా అమ్మ ఆయన వల్ల బాధలు పడీపడీ అస్థిపంజరంలా తయారైంది. పిల్లలు ఏం చదువుతున్నారో, ఏం తింటున్నారో, ఏం కప్పుకుంటున్నారో ఆయన ఏనాడూ పట్టించుకోలేదు. మా అమ్మ మా నాన్న పనిచేసే కంపెనీవాళ్ళ సాయంతో ఆయన పేర అన్ని లోన్లూ తీసుకుని ఆయనకు

తక్కువ జీతం వచ్చేలా చేసి, ఆ మొత్తం దాచుకుని మమ్మల్ని సాకింది, చదివించింది. అదీ చాలక తను నాలుగిళ్లల్లో వంటలు చేసి సంపాదించేది. నేను ఇంటర్ వరకు చదివాను. అమ్మ ఇక నన్ను చదివించలేనంది.

ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే నా క్వాలిఫికేషన్‌కి ఏ ఉద్యోగమూ దొరకలేదు. కాన్వెంట్‌లో టీచర్ ఉద్యోగానికి ప్రయత్నించినా డిగ్రీ అడుగుతున్నారు. అప్పటికీ నా బాధలు చెప్పుకుని రెండుచోట్ల ఉద్యోగం తెచ్చుకున్నా– మా నాన్న తాగి నాకోసం స్కూలుకు రావడం, మా ప్రిన్సిపాల్‌ని, తోటి టీచర్లను అప్పు అడగడం చూసి నాకు ఉద్వాసన చెప్పారు.

వారంరోజుల క్రితం మా నాన్న గుండెపోటుతో చనిపోయారు. కంపెనీవాళ్ళు ఆయనకు రావాల్సినవి ఇంకా సెటిల్ చేయలేదు. వస్తుందని కూడా ఆశించడం లేదు. ఎందుకంటే... ఆయన పేర చాలా లోన్లు తీసుకున్నాం కనుక!

మా నాన్న పోయాక అమ్మ పనికి వెళ్లడం మానేసింది. ఇంట్లో చిల్లిగవ్వ కూడా లేదు. ఎవరిని అడగాలో తోచలేదు. రెండురోజులు నీళ్లు తాగి గడిపాం. ఇంతలో రోజూ కనిపించే మీరు గుర్తొచ్చారు. ఎందుకనో మీరు మంచివారనీ, దయగల వారనీ నాకు తోచింది. అందుకే మీ దగ్గరికి వచ్చాను. నా నమ్మకం వమ్ము కాలేదు.”

ఆమె కథ విన్నాక ఆమె పట్ల జాలి మరింత కలిగింది నాకు.

“ఇంత చిన్నవయసులో నీకు ఇన్ని కష్టాలు రావడం దురదృష్టం. సాటి మనిషిగా నాకు వీలైనంత సహాయం నేను తప్పకుండా చేస్తాను. నా ఫ్రెండ్ రఘునాథ్ ‘లిటిల్ స్టార్స్’ పేరుతో ఓ స్కూలు నడుపుతున్నాడు. అతను చాలా మంచివాడు. మీకు అతని స్కూల్లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను.” అన్నాను.

“ఆ పని చేశారంటే మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను” అంటూ లేచి చేతులు జోడించింది.

“మీ పేరు చెప్పలేదు?!”

“కళ..!”

ఆమె మీద ఎంతో మంచి అభిప్రాయం కలిగింది నాకు. ఆ అభిప్రాయం ఆరోజు సాయంత్రం వరకూ ఉంది.

●

ఆరోజు సాయంత్రం ఏం తోచక మా వీధిలోనే వుంటున్న మా కొలీగ్ అరుణ్ ఇంటికి వెళ్లాను.

అరుణ్ అతని ఫ్రెండ్స్‌తో కార్డ్స్ ఆడుతున్నాడు. వాళ్ళ మధ్య వైన్ బాటిల్స్, గ్లాసులు, పకోడీలు, టేప్‌లో అసభ్యమైన పాటలు! ఆ వాతావరణం నాకు జుగుప్స కలిగించింది.

“నువ్వూ ఓ చేయి వేస్తావా?” అరుణ్ అడిగాడు నన్ను.

“సరదాకైతే ఆడతాను. మీరు డబ్బులు పెట్టి ఆడుతున్నారు కదా!” అన్నాను.

“అవును...” అంటూ నవ్వి “ఫ్రెండ్స్... ఇతను మా కొలీగ్ సిద్ధార్థ! పేరుకు తగ్గట్లే బుద్ధిమంతుడు!” అంటూ అక్కడున్నవారికి నన్ను పరిచయం చేశాడు.

"హాయ్..." అంటూ పలకరింపుగా నవ్వారు అందరూ.

కొంతసేపు ఆట చూస్తూ కూర్చున్నాను.

అరుణ్ ఫ్రెండ్ ఒకతను "అరుణ్... ఆట వుంది, పాట వుంది, మందు వుంది, విందు వుంది... పొందు కూడా వుంటే ఎంతో బాగుండేది!" అన్నాడు.

"అదికూడా అరేంజ్ చేసేవాడిని. కానీ, ఆ అమ్మాయి అడ్రస్ తెలియదు నాకు!" అన్నాడు అరుణ్.

"ఏ అమ్మాయి?"

"మీకు చెప్పలేదు కదూ... వారంరోజుల క్రితం ఓ ఆదివారం రాత్రి ఒక అమ్మాయి వచ్చింది మా ఇంటికి! ఎంతో అందంగా ఉంది. తనకు ఐదు వందలు అర్జంటుగా కావాలనీ, బదులుగా రాత్రంతా నాతో ఉంటాననీ చెప్పింది. నా భార్య పుట్టింటికి పోవడంతో నేను ఐదు వందలు ఆనందంగా ఇచ్చాను. మరుసటిరోజు ఉదయం ఐదు గంటల వరకు నాతో ఉండి ఆనందాన్ని ఇచ్చింది. కోరితే మళ్లీ కూడా వస్తానంది."

అరుణ్ మాటలు విని షాకయ్యాను. ఆ అమ్మాయి ఎలా వుంటుందని అరుణ్‌ని అడిగాను.

అతను చెప్పాడు...

సందేహం లేదు- ఆ అమ్మాయి... కళ!

మనసు నిండా బాధ, నిరుత్సాహం కమ్ముకోగా... వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని ఇంటిదారి పట్టాను.

●

తర్వాత ఒకరోజు ఆఫీసుకు వెళ్తుంటే దారిలో కళ కనిపించింది.

తన ఉద్యోగం గురించి అడిగింది.

ఆఫీసు పనులతో బిజీగా ఉన్నాననీ, వీలు చూసుకుని చెప్తాననీ అన్నాను. ఆమె పట్ల ఏర్పడిన అసహ్యం వల్ల ఆమెతో మాట్లాడాలనీ, సహాయం చేయాలనీ అనిపించలేదు.

వారంరోజుల తరువాత ఆమె మళ్లీ కనిపించింది. తనకు లిటిల్ స్టార్స్ స్కూల్లో ఉద్యోగం దొరికిందని చెప్పింది.

నాకు కృతజ్ఞతలు కూడా చెప్పింది. అది కృతజ్ఞతో, లేక ఎత్తిపొడుపో... నాకు అర్థంకాలేదు.

నేను రఘునాథ్‌తో మాట్లాడలేదు కనుక అది ఎత్తిపొడుపే అనుకున్నాను. మళ్లీ- రఘునాథ్ దగ్గర నా పేరు ప్రస్తావించి వుంటుంది కనుక కృతజ్ఞతే అయివుంటుంది.

●

పది రోజుల తరువాత రఘునాథ్ స్కూలు కెళ్లాను.

నేను వెళ్లేసరికి అతను కళతో మాట్లాడుతున్నాడు. నన్ను చూడగానే "హాయ్... సిద్ధార్థ్! ఏమిటి ఇంత దయ కలిగింది మా మీద?!" అన్నాడు.

నేను కళను గమనించనట్లే రఘునాథ్‌తో చేతులు కలిపి కూర్చున్నాను. ఆమె నావైపే చూస్తూ కొన్ని క్షణాలు నిలబడి తరువాత వెళ్లిపోయింది.

"ఎవరీ అమ్మాయి? ఇదివరకు చూసినట్లు లేదు మీ స్కూల్లో!" అన్నాను ఆమె వెళ్తున్న వైపే చూస్తూ.

'అదేమిటి... నీవేగా పంపింది? ఆమె నీకు తెలియదా?' అంటాడనుకున్నాను. కానీ, అతను అలా అనలేదు.

"కళ అనీ... ఈమధ్యే చేరింది! మంచి అమ్మాయి... ఇంగ్లీష్ టీచ్ చేస్తుంది."

"ఇంగ్లీషా..?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. ఆమెను మొదటిసారి చూసినప్పుడు నాకూ అలా అన్పించలేదు. ఆమె టీచింగ్ చూశాక ఎంతో తృప్తి చెందాను. సాయంత్రాల్లో స్పోకెన్ ఇంగ్లీషు క్లాసెస్ కూడా తీసుకుంటోంది."

ఆమె మా ఇంటికి వచ్చినప్పుడు ఒక్క వాక్యం కూడా ఇంగ్లీషులో మాట్లాడలేదన్న విషయం గుర్తొచ్చింది నాకు. మామూలుగా ఒక కొత్త వ్యక్తి దగ్గర మంచి ఇంప్రెషన్ తెచ్చుకోవడానికి తనకు తెలిసిన ఇంగ్లీషు పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తుంటారు చాలామంది. ఆమె అలా చేయకపోవడం నన్ను ఆశ్చర్యపరిచింది.

"ఆమెకు ఇంగ్లీషులో ఇంత నాలెడ్జి ఎలా వచ్చిందని అడిగాను. జవాబుగా చిన్నకథ లాంటి నిజం చెప్పింది. వాళ్ళ పక్కింటమ్మాయి చిన్నప్పుడు ఈమెతో కలసి ఆడుకునేదిట. హైస్కూలుకి రాగానే ఆ అమ్మాయి కొడైకెనాల్‌లోని ఓ స్కూల్లో చేరిందట. సెలవుల్లో ఇంటికి వచ్చినా కళతో ఎక్కువగా మాట్లాడేది కాదుట. కళ మాట్లాడినా తను ఇంగ్లీషులోనే బదులివ్వడం, తన ఇతర డబ్బున్న స్నేహితురాళ్ళతో ఇంగ్లీషులో మాట్లాడుతూ, అలా మాట్లాడలేని కళను చులకనగా చూసేదిట. అందువలన ఎలాగైనా ఇంగ్లీషు నేర్చుకోవాలనే పట్టుదల కళకు వచ్చిందిట. రోజూ హిందూ కొనేదట. లైబ్రరీ కెళ్లి కథల పుస్తకాలు ఇంటికి తెచ్చుకుని చదివేదట. తల్లిని పోరి ఓ డిక్షనరీ కొనుక్కుని కొత్త పదాలకు అర్థాలు వెతికేదట. వస్తున్న రోజులు ఎన్నో ఉన్నా హిందూ పేపర్ కొనని రోజు మాత్రం లేదట. అలా కష్టపడి ఇంగ్లీషులో ప్రావీణ్యం తెచ్చుకుందిట. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలోని ముప్పాతిక భాగం పదాలకు అర్థాలు తెలుసట ఆమెకు!" అన్నాడు రఘునాథ్.

ఆమెలో ఒక భాషను నేర్చుకోవాలన్న పట్టుదలను, కృషితో సాధించిన వైనాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

"ఇంతకీ... ఆమెను ఎవరు రికమెండ్ చేసి పంపారు నీ దగ్గరికి?" అని అడిగాను.

"ఎవరూ పంపలేదు. తనే వచ్చి అడిగింది. తన ఇంటి పరిస్థితులు వివరించింది. జాలేసి ఉద్యోగం ఇచ్చాను. నా అంచనాకు మించి పనిచేస్తోంది. ప్రవర్తన కూడా చాలా డీసెంట్‌గా ఉంది. మామూలుగా కొత్తగా చేరినవాళ్ళకు రెండువేలకు మించి ఇవ్వను నేను. కానీ, ఈమెకు మూడువేలు ఇవ్వాలనుకుంటున్నాను" అన్నాడు.

'ఫర్వాలేదు. ఆ జీతంతో ఆమె కుటుంబం హాయిగా కాకపోయినా ఆకలికి అలమటించ కుండా బ్రతకవచ్చు' అనుకున్నాను.

తరువాత రఘునాథ్ దగ్గర సెలవు తీసుకుని బయటకు వచ్చాను. ఆమె అంటే కోపం కొంత తగ్గి, ఇష్టం పెరిగింది నాలో.

ముఖ్యంగా... ఆమె నా పేరు వాడుకోకుండా ఉద్యోగం తెచ్చుకోవడం ఆమెపై గౌరవాన్ని పెంచింది.

•

ఆరు నెలలు గడిచాయి!

కళను అప్పుడప్పుడు వీధిలో చూసేవాడ్ని. ఆమెను చూడగానే మనసులో ఏదో ఒక రకమైన అలజడి కలిగేది. వారంరోజులు ఆమె కనబడకపోతే మనసంతా దిగులుగా అనిపించేది. స్కూలుకెళ్లి ఆమెను చూద్దామని అనిపించినా మళ్లీ రఘునాథ్ ఏమనుకుంటాడోనని ఆ ఆలోచన విరమించుకునే వాడ్ని.

రాత్రిళ్లు నిద్ర పట్టేది కాదు.

ఆమె గురించే ఆలోచించేవాడ్ని. నాకంటూ ఎవరూ లేని నేను- ఆమెకు సర్వస్వం కావాలని అనుకుంటున్నాను.

ఆమె అందం, సంస్కారం, వ్యక్తిత్వం నాకెంతో నచ్చాయి. ఆమె చూపుల్లో కూడా నాపట్ల ఆరాధనా భావం కనబడింది నాకు.

అయితే అరుణ్ మాటలు నా చెవుల్లో మార్మోగుతూనే వున్నాయి. ఏదో ఒకరోజు ఆమెనే నిలదీయాలి.

ఆమె నిజం చెబుతుందన్న నమ్మకం నాకుంది. ఆరోజు కోసం ఎదురుచూస్తున్న నాకు మళ్లీ ఆమె క్యారెక్టర్ గురించి అనుమానం కలిగించే విషయం ఒకటి నా దృష్టికి వచ్చింది.

ఈమధ్య కళ నాకు స్కూటీపై ఎదురొస్తోంది. ఎక్కడిది ఈమెకు ఇంత డబ్బు? అరుణ్‌లాంటి వాళ్ళు ఇచ్చారా? రఘునాథ్ కూడా ఈమె ట్రాప్‌లో పడ్డాడా?

రఘునాథ్ మంచివాడే. కానీ, 'ఎంతవారలైనా కాంతదాసులే' కదా! ...మనసులో ఎన్నెన్నో అనుమానాలు!

ఒకరోజు రఘునాథ్ స్కూలుకెళ్లాను. ఆ మాటా ఈ మాటా మాట్లాడి, "ఎలావుంది మీ కొత్త ఇంగ్లీషు టీచర్?" అని అడిగాను.

"ఆమె ఇప్పుడు మా స్కూల్లో పనిచేయడం లేదు."

"ఏం..?" ఆశ్చర్యంగా అడిగాను.

"నీకు సెయింట్ మేరీ స్కూలు తెలుసుగా! ఈ ఊర్లో నెంబర్‌వన్ పొజిషన్‌లో ఉన్న స్కూల్ అది. వాళ్ళ స్కూల్‌లో స్పోకెన్ ఇంగ్లీషు క్లాసెస్ తీసుకోవడానికి ఎనిమిది వేలు ఆఫర్ చేశారు కళకు. అయితే అవసర సమయంలో ఉద్యోగం ఇచ్చి అదుకున్నానని నా స్కూల్ వదలడానికి ఇష్టపడలేదు తను. నేనే నచ్చజెప్పి పంపించాను. నేనెటూ ఎనిమిది వేలు ఇవ్వలేను. వేరే చోట ఇస్తున్నప్పుడు ఎందుకు వద్దనాలి? ఆమె కుటుంబానికి ఆ డబ్బులు ఎంతో అవసరం. అయితే ఆమె లేని లోటు నాతోపాటు నా స్టూడెంట్స్ కూడా ఫీలవుతున్నారు."

'ఆమె ఆబ్‌సెన్స్‌ను ఆమెతో ఉన్నవాళ్ళు అంతగా ఫీలవుతున్నారంటే ఆమె తన మంచితనంతో, ప్రతిభతో వీళ్ళందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసివుంటుంది. కళా... యు ఆర్ గ్రేట్!' అనుకున్నాను.

"ఆమె ఈమధ్య స్కూటీపై కనబడుతూంటే స్కూలు మారిందేమోనని నాకూ అనుమానం వచ్చింది!" అన్నాను.

"ఇప్పుడామె పని చేస్తున్న స్కూలు వాళ్ళ ఇంటికి చాలా దూరంగా వుంది. అందువల్ల బ్యాంకులో లోను తీసుకుని స్కూటీ కొన్నది."

ఆమె గురించీ, రఘునాథ్ గురించీ చెడుగా ఆలోచించినందుకు సిగ్గుపడ్డాను.

రఘునాథ్ దగ్గర సెలవు తీసుకుని రోడ్డుపై నడుస్తూ కళ గురించే ఆలోచించసాగాను.

కళ జీతం ఎనిమిది వేలు. నా జీతం కంటే ఎక్కువ. ఐదు వందల కోసం తన శీలాన్నే పణంగా పెట్టబోయిన ఆమె ఈరోజు అంత జీతం తీసుకుంటున్నదంటే నాకు ఆశ్చర్యంగా ఉంది...

'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అన్న సూక్తి గుర్తొచ్చింది నాకు.

●

దాదాపు ఆరు నెలల తరువాత ఓరోజు రాత్రి నేను హోటల్లో భోజనం చేసి, నా గదికొచ్చి వారపత్రిక తిరగేస్తుంటే కళ వచ్చింది.

నేను అప్రయత్నంగా లేచి నిలబడి, "రండి... కూర్చోండి!" అన్నాను.

ఆమె కుర్చీలో కూర్చున్నాక నేనూ కూర్చున్నాను.

ఆమె ఎందుకో నీరసంగా కనిపించింది. మొహంలో బాధ కూడా కనిపించింది.

ఆమె పర్సు తెరిచి ఐదు వందల రూపాయల నోటు ఒకటి బయటకి తీసి "మీ ఐదు వందలు మీకు ఇచ్చేయాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా ఏదో ఒక ఖర్చు అడ్డుపడుతూ ఉంది. ఆలస్యం చేసినందుకు మన్నించండి!" అంటూ నోటు పట్టుకున్న చేతిని నా వైపు చాపింది.

నేను నోటును చూడడం లేదు. ఆమె చేతి తెల్లదనాన్ని, సౌకుమార్యాన్ని చూడసాగాను.

"తీసుకోండి ప్లీజ్ః..."

"ఫర్వాలేదు... ఉంచండి!" అన్నాను ఆమె వైపు చూస్తూ.

"లేదు... తీసుకోండి! ఇప్పటికే చాలా ఆలస్యం చేశాను..." అంటూ లేచి టేబుల్ పైన నోటు పెట్టి దానిపై ఓ పుస్తకాన్ని ఉంచి మళ్లీ కుర్చీలో కూర్చుంది.

ఐదు వందల నోటును చూడగానే నాకు అరుణ్ మాటలు గుర్తుకొచ్చాయి.

"మిమ్మల్ని ఓ మాట అడుగుతాను... ఏమనుకోరుగా?"

"అడగండి..."

"మీరు ఇలా ఐదు వందలు నన్ను కాక ఇంకెవరినైనా అడిగారా?" ఆమె మొహంలోకి తొంగిచూస్తూ అడిగాను.

ఆమె భయంగా నావైపు చూసింది.

"ఫర్వాలేదు... చెప్పండి! నేనేమీ అనుకోను. ఎవ్వరితో చెప్పను."

"మీ కొలీగ్ అరుణ్‌ని అడిగాను. నిజానికి డబ్బు అడగడానికి నేను ఎన్నుకున్న వ్యక్తులు మీరు, అరుణ్. ఎందుకంటే మీరిద్దరే అప్రోచబుల్‌గా కనిపించారు నాకు. అయితే మీకింకా పెళ్ళి కాలేదు. అరుణ్ పెళ్ళయి భార్యాపిల్లలున్న వాడు. వయసు ఆవేశం తగ్గి యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం కలిగి ఉంటాడని ఆశించాను.

నా ఆశ నిరాశైంది. ఐదు వందలిచ్చి నా చేయి పట్టుకున్నాడు. ఇంట్లో అందరూ ఆకలితో ఉన్నారని, మరుసటి రోజు వస్తానని చెబితే... తనూ ఆకలితోనే ఉన్నానన్నాడు. బలవంతంగా నా చేయి విడిపించుకుని ఆ డబ్బు అతని ముఖాన కొట్టి వచ్చేశాను. తరువాత మీ దగ్గరికి వచ్చాను. మీరూ అదేవిధంగా ప్రవర్తిస్తే ఎలా తప్పించుకోవాలా... అని భయపడ్డాను. కానీ, మీరు మనిషిలా స్పందించారు. మా ఆకలి తీర్చారు."

"ఐదు వందలు అడగాలని ఎందుకు అనుకున్నారు? వంద అడిగితే ఎవరైనా సులభంగా ఇచ్చేవారు కదా?!"

"వంద దొరికినా అది నాలుగురోజుల్లో ఖర్చయిపోతుంది. ఐదు వందలు దొరికితే నాకు ఉద్యోగం దొరికేదాకా మళ్లీ ఇంకొకర్ని అడిగే అవసరం ఉండదని అనుకున్నాను.

అయితే, ఆ ఐదు వందలు ఓ అపరిచిత వ్యక్తికి ఇవ్వడానికి ఎవ్వరైనా తటపటాయిస్తారు. అందువల్ల నా శరీరాన్ని ఎరగా చూపి, డబ్బులు తీసుకుని అప్పటికి ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుని నాకు ఉద్యోగం దొరికాక ఆ డబ్బు తిరిగి ఇచ్చేద్దామని అనుకున్నాను.

కానీ, ఇప్పుడు ఆలోచిస్తే నేను ఎంత సంస్కార రహితంగా ఆలోచించానో, అసలు ఎలా ఆ విధంగా మాట్లాడగలిగానో అనిపిస్తోంది. అందుకు సిగ్గుపడుతున్నాను కూడా."

"తప్పు మీది కాదు... ఆకలిది! ఇప్పుడు చేతిలో డబ్బుంది కాబట్టి సంస్కారం గురించి, సభ్యత గురించి ఆలోచిస్తున్నారు. అప్పుడు మీ ప్రయారిటీ మీ ఇంట్లోవాళ్ళ ఆకలి తీర్చడం! ఆ పరిస్థితుల్లో కూడా మీరు దారి తప్పలేదు. అందుకు మిమ్మల్ని అభినందించాలి."

ఆమె తనను అర్థంచేసుకున్నందుకు కృతజ్ఞతగా నావైపు చూసింది. నా మనసులోని మబ్బులు తొలగిపోయాయి. అలజడి మాయమైంది. హాయిగా, ప్రశాంతంగా ఉంది నా మనసిప్పుడు.

"ఎలావుంది మీ కొత్త స్కూలు?" అన్నాను టాపిక్ మారుస్తూ.

"నేను అక్కడ ఉద్యోగం వదిలేస్తున్నాను."

"ఎందుకు?"

"నాకు మాల్దీవ్స్‌లో ఉద్యోగం వచ్చింది. ఇరవై వేలు జీతం ఇస్తారట! మా స్కూల్ వాళ్ళే నా అప్లికేషన్ పంపి నన్ను రికమెండ్ చేశారు."

నోట మాట రానట్లు కూర్చుండిపోయాను.

గుండె లోతుల్లో బాధ మొదలైంది.

నేను ఆమెను ప్రేమిస్తున్నానని, ఆమె లేకుండా బ్రతకలేనని నాకు అర్థమైంది.

"మా నాన్న పోయాక మేము ఎలా బ్రతకగలమో అని భయపడ్డాను. కానీ, ఆశ్చర్యంగా నేను కలిసిన వాళ్ళందరూ నేను ఊహించని సహాయాలు చేశారు. నా బాగు కోసం తపించిన

మిమ్మల్ని అందర్నీ వదిలి వెళ్లాలంటే నాకూ బాధగానే వుంది. కానీ, నావాళ్ళ బాగు కోసం నేను వెళ్లక తప్పదు..." అంది.

"ఎంతసేపూ మీవాళ్ళ గురించే ఆలోచిస్తున్నారు. మీ గురించి మీరు ఆలోచించరా? పెళ్ళి చేసుకుని ఆనందంగా ఉండాలని లేదా మీకు?" కాస్త కోపంగానే అన్నాను.

"ఎందుకు లేదు? ఎవరైనా మంచిమనిషి మనస్ఫూర్తిగా నన్ను తన జీవితంలోకి ఆహ్వానిస్తే తప్పక పెళ్ళిచేసుకుంటాను."

ఆ సమాధానం నా మనసుకి ఆనందాన్ని ఇచ్చింది.

ఆమెతో ఏదో చెప్పాలని, ఏదైనా మాట్లాడాలని ఉంది. ఏదీ చేయలేకపోతున్నాను.

"కొత్త ప్రదేశంలో నాకు మంచి జరగాలని ఆశీర్వదించండి!" అంటూ నా కాళ్లకు నమస్కరించబోయింది.

నేను కంగారుగా దూరంగా జరుగుతూ, "నేనంత పెద్దవాడ్ని కాను..." అన్నాను.

"నాకంటే పెద్దవారే!" అంటూ నమస్కారం చేసింది.

ఆమెకు అంతా మంచే జరగాలని మనస్ఫూర్తిగా దీవించాను. నా కళ్ళనిండా నీరు నిండింది.

"వెళ్లొస్తాను..." రెండు చేతులూ జోడించి దీనంగా నావైపు చూసి బయటకు నడిచింది.

ఆ చూపులో నేను వెతుకుతున్నది దొరికినట్లు అనిపించింది నాకు.

"కళా..." అని పిలిచాను.

వెనక్కి తిరిగి ఏమిటన్నట్లు చూసింది.

"మీరు మాల్దీవ్స్‌కి వెళ్లే తీరాలా? నా జీతంతో, ఇక్కడ మీకు వచ్చే జీతంతో మనం ఐదుగురం బ్రతకలేమా?"

ఆమె కళ్ళు ఆశ్చర్యంగా వెడల్పయ్యాయి. మొహం ఆనందంతో విప్పారింది.

"ఐ లవ్ యూ కళా!"

ఆమె పరుగున వచ్చి నా ఎదపై వాలిపోయింది. నా చేతులు ఆమెని చుట్టుముట్టాయి.

"మీ నుంచి ఈ మాట కోసం ఎన్ని నెలలుగా ఎదురుచూస్తున్నానో తెలుసా?"

ఆమె ఏడుస్తోంది!

ఆ ఏడుపు ఆకలి వల్ల కాదు... ఆనందం వెల్లువైనందువల్ల!

'ఆంధ్రభూమి' మాసపత్రిక' ... ఆగస్ట్ 2005